

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



**గగన్ ఝున్ ఝునా రహా పవన్ సన్ సనా రహా**

**లహర్ లహర్ పె ఆజ్ హై తుఫాన్**

**హో నయ్యా వాలె హో సావధాన్**

సినిమా పేరు 'నాస్తిక్'. కానీ సినిమా అంతా భగవంతుడిని కీర్తించే పాటలే. పలు అత్యద్భుతమైన భక్తి, భజన పాటల్లో అత్యుత్తమమైనది ఈ పాట. కవి ప్రదీప్ రాసిన ఈ పాటకు సంగీత దర్శకత్వం వహించింది సి.రామచంద్ర. హిందీ సినీ సంగీత ప్రపంచంలో సి.రామచంద్ర వంటి సంగీత దర్శకుడు మరొకరు లేరనటం ఉన్నమాటనే మరోసారి అన్నట్టుంటుంది. ఒక సినిమాలో ఎన్ని పాటలుంటే అన్ని పాటలనూ సూపర్ హిట్‌లుగా మలచటమే కాదు నాణ్యత విషయంలో ఎలాంటి సందేహాలు లేకుండా పండితులు, పామరులు మైమరచి ఉర్రూతలూగే రీతిలో రూపొందించటం సి. రామచంద్ర ప్రత్యేకత. ఆయన అదరగొట్టే ఆర్కెస్ట్రాను వాడడు. సందర్భానుసారం తగినన్ని వాయిద్యాలనే అత్యంత సృజనాత్మకంగా వాడతాడు. ఇక పాటకు తగ్గ స్వరాల్ను ఎన్నుకోవటం, ఆ స్వరాల స్వభావాలను సంపూర్ణంగా ఆకళింపు చేసుకుని బాణీని రూపొందించి భావాలు పలికించి పాట ప్రభావాన్ని పెంచటంలో సి.రామచంద్ర తరువాతనే ఎవరయినా. ఇక లతా మంగేష్కర్ స్వరాన్ని సి.రామచంద్ర ఒక శిల్పి తను మెచ్చిన ప్రేయసి శిల్పాన్ని ఎంత జాగ్రత్తగా, శ్రద్ధగా ప్రేమతో రూపొందిస్తాడో అంత అపురూపంగా తన పాటలలో తీర్చిదిద్దాడు. సి.రామచంద్ర పాటలలో వాడినట్టుగా లత స్వరాన్ని మళ్లీ శంకర్ జై కిషన్‌లే వాడారనవచ్చు.

సి.రామచంద్ర పాటలలో పదాల భావాలకు అంత ప్రాధాన్యాన్నివ్వడు అన్న ఆరోపణ ఉంది. పాటలో పదాలకు ప్రాధాన్యాన్నివ్వడు అనేకన్నా ఆయనకు పదాలు తన భాణీలో ఒదిగి బాణీ ప్రభావాన్ని ఇనుమడిస్తే చాలు, గొప్ప కవిత్వం కాకున్నా పట్టించుకోడు. అందుకే 'ఇనమినడిక డేడాయ్ డమనిక' లాంటి పదాలతో పాటలను రూపొందించి హిట్ చేశాడు. ఆ కాలంలో సంగీత దర్శకులు అనేకులు గేయ రచన కవితలాగా ఉండేందుకు ప్రాధాన్యాన్నిచ్చేవారు. సి.రామచంద్రకు అలాంటి పట్టింపు లేవు. పదాలు బాణీలో ఒదిగితే చాలు. శంకర్ జై కిషన్‌లు కూడా బాణీకి ప్రాధాన్యం ఇస్తారు. అలాగని సి.రామచంద్ర పాటలలో అల్లరి చిల్లరి అర్ధంలేని పదాలు ఉండవు. హిందీ సినీ గీతాలలో అత్యద్భుతమైన సాహితీ విలువలున్న పాటల జాబితాలో సి.రామచంద్ర రూపొందించిన పాటలు అనేకం ఉంటాయి.

'నాస్తిక్' సినిమా భారతదేశ సాంఘిక చరిత్రలో ఒక కీలకమైన దశలో వచ్చింది. దేశ విభజన జరిగింది. గాయం మానలేదు. విద్వేషాలు చల్లారలేదు. కానీ ఒక పద్దతి ప్రకారం దేశ విభజన తాలూకు గాయాలను విస్మృతిలోకి నెట్టి సమాజం ముందుకు సాగేట్టు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. దాంతో దేశ విభజనకు సంబంధించి సినిమాలలో ప్రస్తావనలు లేని పరిస్థితి వచ్చింది. సాహిత్యంకూడా కర్ర విరగకుండా పాము చావకుండా సామరస్యధోరణిని ప్రదర్శిస్తూ చేదు నిజాలను చాపక్రిందకు నెట్టేస్తూ వచ్చింది. ఇలాంటి పరిస్థితిలో దేశ విభజన అన్నది కేంద్రబిందువుగా రూపొందిన సినిమా 'నాస్తిక్ '.

దేశ విభజన సమయంలో తన వారు దారుణంగా హత్యకు గురవటం చూస్తాడు హీరో. ప్రాణాలు దక్కించుకున్నవారు దారుణంగా మోసపోవటం తెలుసుకుంటాడు. భగవంతుడిపై ద్వేషం పెంచుకుంటాడు. దేవుడిని నమ్మని నాస్తికుడు అవుతాడు. తమని మోసం చేసి అన్యాయం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ప్రేమను పావులా వాడతాడు. కానీ ఆమె భక్తికి, అమాయకత్వానికి, విశ్వాసానికి తలవంచి చివరిలో ఆస్తికుడు అవుతాడు.

ఈ సినిమాలో 'జైజై రామ రఘురాయీ, కాన్‌హా బజాయే బాసురీ' వంటి పరమాద్భుతమైన పాటలున్నాయి. 'దేఖ్ తెరే సంసార్‌కి హాలత్ క్యా హోగయి భగవాన్' పాట 'నాస్తిక్' సినిమాలోని ఇతర పాటలను డామినేట్ చేస్తుంది. ఈ పాట ఎంతగా 'హిట్' అయిందంటే సాహిర్ లూధియాన్వీ 'రైల్వే ప్లాట్ ఫారం' సినిమాలో ఈ పాటకు పారడీ పాట రాశాడు.

**దేఖ్ తెరే భగవాన్‌కి హాలత్ క్యాహోగయీ ఇన్సాన్**

**కిత్ నా బదల్ గయా భగవాన్**

సాహిర్ లూధియాన్వీ దైవాన్ని నమ్మడు. అందుకే దేశవిభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లినా అక్కడి మతమౌఢ్యం సరిపడక భారత్ తిరిగి వచ్చేశాడు. 'భగవంతుడా నీ ప్రపంచం ఎంతగా మారిపోయిందో చూడు, మనిషి ఎంతగా మారిపోయాడో చూడు' అని 'నాస్తిక్ 'లో కవి ప్రదీప్ రాస్తే, సాహిర్ 'నీ భగవంతుడి పరిస్థితి ఎమయిందో చూడు, ఓ మనిషీ, భగవంతుడు ఎంతగా మారిపోయాడో' అని వ్యంగ్యంగా పారడీ చేశాడు సాహిర్. భగవంతుడు పేదవారిని పట్టించుకోడు, గుళ్లు కట్టించి, పూజలు చేసే ధనవంతుడినే పట్టించుకుంటాడు అంటూ హేళన చేస్తాడు సాహిర్.

**భూఖోంకి ఘర్‌మే ఫేరానడాలే**

**సేఠోంక్ హో మెహమాన్**

**కిత్‌నా బదల్ గయా భగవాన్**

'అందాల రాముడు' సినిమాకు ప్రేరణలా అనిపించే 'రైల్వే ప్లాట్ ఫారం' సినిమా అప్పటి సామాజిక పరిస్థితులపై వ్యంగ్య బాణం. చదువుకున్నవాడు ఎందుకూ పనికిరాడని, పేదవాడిని దోచుకోవటమే ధనవంతుడి పని అని, దాన్ని 'భక్తి' ముసుగులో దాస్తాడని చక్కగా చూపిస్తుందీ సినిమా. ఈ సినిమాలో సాహిర్ ఒక చక్కని భజన గీతం రాశాడు. భజన ఓ వైపు, దూరంగా ధనవంతులు, పాశ్చాత్య పాటలు పాడుతూ చేసే నృత్యం ఓవైపు సాగుతూ భక్తికీ, దురాశకూ నడుమ సంఘర్షణను చక్కగా ప్రదర్శిస్తుందీ దృశ్యం.

'గగన్ ఝున్ ఝునారహో' పాటకోసం సృజించిన సన్నివేశం చాలా గొప్పది. నాయిక నదికి ఈ వైపున ఉంటుంది. ఆ వైపున గాయపడిన హీరో ఒంటరిగా ఉంటాడు. చిన్న దొప్పలో నాయిక ఆ వైపుకు వెళ్లాలనుకుంటుంది. నది వరదలో ఉంటుంది. ఆకాశంలో మేఘాలు దట్టంగా అలుముకుంటాయి. ఉరుములు, మెరుపులకు తోడుగా గాలి భీభత్సంగా వీస్తూంటుంది. నాయిక ఒక్క సెకను ఆలోచిస్తుంది. కానీ అంతలోనే నిశ్చయించుకుంటుంది. దొప్పను నీళ్లల్లోకి తోసి పరవళ్లు తొక్కుతూ ప్రళయ కాల ప్రవాహంలా ఉన్న నదిలో ప్రియుడిని కలిసేందుకు ప్రయాణమవుతుంది.

పాట ఆరంభంకన్నా ముందే గాలి వీస్తున్న శబ్దాలు, మేఘాలు దట్టంగా అలముకోవటం కనిపిస్తుంది. నాయిక నీటిలో దిగుతుంది. ఆమె భక్తురాలు. దైవంపై విశ్వాసం కలది. దైవం పై విశ్వాసం ఉండటం అంటే వ్యక్తికి ఆత్మవిశ్వాసం ఉండటం. దైవంపై విశ్వాసం దౌర్బల్యం కాదు. దౌర్బల్యం నుండి కలిగే భక్తి విశ్వాసం కాదు. ఆత్మవిశ్వాసం ఆధారంగా కలిగే విశ్వాసం అసలు భక్తి. అందుకే ఆమె దైవంపై భారం ఉంచి నీటిలో దిగుతుంది.

'భక్తి'లో ఇది ప్రధానమైన అంశం. కార్యం చేయాల్సింది తాను. కానీ కర్తృత్వం, ఫలితం సర్వం భగవంతుడికే వదిలేయాలి. చేస్తున్న పనిపై వ్యామోహం కానీ, ఫలితంపై ఉద్విగ్నత కానీ ఉండకూడదు. సర్వం భగవంతుడే చూసుకుంటాడు. తన పని కర్తవ్యం నిర్వహించటం వరకే అన్న విశ్వాసం ఉండాలి. స్వామి వివేకానంద తన పలు ఉపన్యాసాలలో ఈ అంశాల్నే నొక్కి చెప్తారు.

'భగవంతుడి మీద భారం వేసి ముందుకు సాగండి. భగవంతుడే దారి చూపిస్తాడు ' అని. ఆయన జీవితంలో దాన్నే ఆచరించి చూపారు కూడా. 'నాస్తిక్' సినిమాలో నాయిక కూడా అదే చేస్తుంది. తుఫానులాంటి గాలి వీస్తోంది. నది ప్రళయంలోలా పరవళ్లు తొక్కుతోంది. వర్షం ముంచెత్తుతోంది. కానీ భగవంతుడిపై భారం వేసి ముందుకు సాగింది. అప్పుడు దూరంగా కొండపై నుంచి ఒక శాంతమైన స్వరం పాట అందుకుంటుంది. అస్పష్ట ఆకృతి దివ్య తేజస్సు పరీవృతమై ఉంటుంది. ఆ స్వరం చెప్పేది, 'నావికుడా జాగ్రత్త' అని. ఇక్కడే పాటలు పాడే స్వరాలను ఎన్నుకోవటంలో సంగీత దర్శకుడి ప్రతిభ స్పష్టమయ్యేది. ఈ పాటలో ఆ శాంత గంభీర స్వరం హేమంత్‌కుమార్ తప్ప మరెవరదయినా పాట అభాసుపాలయ్యేది. పాట ప్రభావం తగ్గిపోయేది. హేమంత్ కుమార్ స్వరంలో ఒక పవిత్రత ఉంటుంది. మాధుర్యం

సంగతి చెప్పనక్కరలేదు. మత్తు ఉంటుంది. ఈ మత్తు మాధుర్యం వల్ల కలిగే  తన్మయత్వం ఆ స్వరంలోని స్వచ్ఛత, పవిత్ర భావనల వల్ల కలుగుతుంది. అందుకే లతా మంగేష్కర్ 'హేమంత్ కుమార్ పాడుతూంటే, ఒక భక్తుడు మైమరచి మందిరం ప్రాగణంలో భజనగీతం పాడుతున్నట్టుంటుంది' అంది. అది నిజమే. ఓ వైపు తుపాను తాకిడికి సర్వ ప్రకృతి అల్లల్లాడుతూంటే 'గగన్ ఝున్  ఝునారహో' అంటున్న హేమమంత్ కుమార్ స్వరం వినగానే ఒక రకమైన ప్రశాంతత మనస్సును చుట్టుముట్టుతుంది. నావికుడికి జాగ్రత్త చెప్పటంలో ఆందోళన లేదు. ఉద్విగ్నత లేదు. గమనిస్తే, మనిషికి ఆందోళన కానీ ఉద్విగ్నత, భయాలు కానీ అజ్ఞానం లోంచి కలుగుతాయి. అన్నీ తెలిసిన వాడికి లేదా దేనిపై కోరిక లేని వాడికి ఎలాంటి భయాలుండవు. నావికుడికి జాగ్రత్త చెప్తున్న అతనికి సర్వం తెలుసు. దేనిపై కోరికలేదు. వాంఛ లేదు. పైగా, ఆమెకు భగవంతుడిపై విశ్వాసం ఉందనీ తెలుసు. ఆమెకు జాగ్రత్త చెప్పటంలో ఆ విశ్వాసాన్ని మరింత తీవ్రం చేయమని సూచించటమే తప్ప బెదిరింపులేదు. ఈ భావాన్ని హేమంత్ కుమార్ స్వరం మాత్రమే కలిగించగలదు. ప్రేమ పూర్వకమైన హెచ్చరిక, సూచనలా ధ్వనింపచేస్తాడు హేమంత్ కుమార్. అతని స్వరం ఎంత శాంతంగా ఉంటుందో, వెంటనే పలికే లత స్వరంలో అంత ఆవేదన, ఆర్తి, అభ్యర్థనలుంటాయి.

**హే బ్రహ్మ, హే విష్ణూ, హే శంకర్ సర్వ శక్తిమాన్**
**రక్ష కరొ, రక్ష కరో, హే దయా నిధాన్**
**మే పత్ రాఖో భగవాన్.**

ఆమె భక్తురాలు. నిత్యం భగవంతుడిని స్మరించి, విశ్వసించే ఆమె కష్టకాలంలో భగవంతుడిని స్మరించటంలో ఆశ్చర్యంలేదు. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే ఆమె తన కష్టాన్ని తొలగించమని భగవంతుడిని వేడుకోవటంలేదు. అభ్యర్థించటంలేదు. ఆమె తన Integriity సమగ్రతను కాపాడమని భగవంతుడిని ప్రార్థిస్తోంది. సినిమాలో నాయకుడు దుష్టుడు. ప్రతీకారేచ్ఛతో పశువుకన్నా హీనంగా ప్రవర్తిస్తాడు. తన ప్రతీకారం తీర్చుకోవటం కోసం నాయికను వాడుకుంటాడు. కానీ ఆమె అతడిని ప్రేమిస్తుంది అతడికి భగవంతుడి మీద విశ్వాసం లేదని తెలుసు. అయినా ఆమె ప్రేమ అచంచలం. నాస్తికులు ద్వేష భావన ప్రదర్శిస్తారు. ఆస్తికులు ప్రేమ వెలుగులు వెదజల్లుతారు. తమపై తమకే విశ్వాసంలేని వారు భగవంతుడిని విశ్వసించలేరు. విశ్వసించలేని వారికి ప్రపంచమంతా అనుమానమే. అసహనమే. విశ్వసించే వారిని చూస్తే భరించలేరు. ఇది ఆమెకు తెలుసు. అతని మీద ప్రేమలో తనని తాను మరచిపోకుండా తన వ్యక్తిత్వానికి తన సమగ్రతకు భంగం రాకుండా చూడమని వేడుకుంటోంది. తుపాను నుంచి తప్పించమనటంలేదు. ఒడ్డుకు చేర్చమనటం లేదు. తనను రక్షించమనటంలేదు. తన వ్యక్తిత్వాన్ని రక్షించమంటోంది. ఇది అసలు ఆస్తికత. ఇది సంపూర్ణ విశ్వాసం. జరిగేది జరగక మానదు. ఆ విషయంలో ఆందోళన లేదు. కానీ ఈ తుఫానులో తనని తాను కోల్పోకూడదు. అదీ ఆమె కోరిక.

హిమ్మత్ న హార్, ప్రభు కోపుకార్
వోహి తేరా నయ్యా లగాదేగా పార్
తనిక్ హి తిల్‌మిలానన
జరాభి దిల్ హిలానా న
హజార్ హాథ్ వాలా హై భగవాన్
హో నయ్యా వాలో హో సావధాన్.

ధైర్యం కోల్పోవద్దు. ప్రభువును స్మరించు. అతడే నీ నౌకను ఒడ్డుకు చేరుస్తాడు. కొంచెం కూడా అధైర్యం వద్దు. కాస్తకూడా కంగారు పడవద్దు. హృదయంలో శంకవద్దు. వెయ్యి చేతుల వాడు భగవంతుడు. ఓ నావికుడా జాగ్రత్త.

ఎలాంటి ఉద్విగ్నత లేకుండా, ఆందోళన లేకుండా శాంతంగా ధైర్యం చెప్తున్న హేమంత్ కుమార్ స్వరం వింటూంటేనే ఎంతో శాంతి కలుగుతుంది. నేపథ్య సంగీతం కూడా అప్పటి వరకూ ఉన్న ఉద్విగ్నతను, తీవ్రతను, వేగాన్ని తగ్గించుకుని శాంతం అవుతుంది. ఇక్కడ అతడు ఆమెను ఒడ్డుకు చేర్చగలవాడు భగవంతుడే, భగవంతుడిపై విశ్వాసాన్ని కోల్పోవద్దు అంటున్నాడు. కానీ నాయిక తనను ఒడ్డును చేర్చమనటంలేదు.

హే గోవింద, హే ముకుంద
సంకట్ మే ఆజ్ మేరి ప్రాణ్
రక్ష కరో రక్ష కరొ హే దయా నిధాన్
మేరి పత్ రాఖో భగవాన్.

సంకటంలో ఉందట ఆమె ప్రాణం. ఆమె ప్రాణం నది మధ్యలో తుపానులో చిక్కుకుని లేదు. ఆమె ప్రాణం ఒడ్డున ద్వేషం తుఫానులో చిక్కుకుని ఉంది. ద్వేష భావనల విషపు తుపాను గాలులనుంచి తన ప్రాణంలాంటి ప్రియుడిని రక్షించమంటోంది. తన వ్యక్తిత్వాన్ని కాపాడమంటోంది ఇది అసలైన భక్తి. తనకోసం ఏమీ కోరడు అసలైన భక్తుడు. 'అందరి గురించి అడుగుతున్నావు. నీ గురించి ఏదైనా కోరుకో' అని భగవంతుడు అంటే 'నీ చరణ కమలాలపై నుంచి నా దృష్టి కదలకుండా వరమియ్యమ'ని కోరాడట భక్తుడు. అలాంటి భక్తి నాయికది. అసలైన ఆస్తికులు ఇలా ఉంటారు. నాస్తికుల ద్వేషాన్ని ప్రేమతో గెలుస్తారు. అందుకే 'నాస్తిక్' సినిమాలో చివరికి హీరో ఆస్తికుడవుతాడు.

దునియా భర్‌కే నాస్తిక్ కిత్‌నే నమక్ హరాం
ఆప్ నా దోష్ న దేఖేతే ప్రభూ కోకరే బద్ నాం.

'నాస్తిక్'లోని పాట ఇది. ఈ ప్రపంచం నిండా ఉన్న నాస్థికులంతా ద్రోహులు. స్వీయ దోషాలు పట్టించుకోరు. వాటిని చూడరు. ప్రభుల పై దోషం నెట్టి అతని పేరు చెడపాలని చూస్తారు.

**జోర్ లగాలే అరే జమానా కిత్‌నా జోర్ లగాయేగా**

**ఇస్ జగ్ మే భగవాన్  క ఝండా కభీన ఝుక్ నే పాయేగా**

ప్రపంచం ఎంత ఒత్తిడి చేసినా, అణచి వేతకు ఎంతగా ప్రయత్నించినా ఏం చేసినా ఈ ప్రపంచంలో భగవంతుడి జండా ఎగురుతూనే ఉంటుంది. నాస్తిక్ సినిమా చివరలో హీరో నాస్తికత్వం ద్వేషం అనీ, పొరపాటు అనీ గ్రహించి భగవంతుడి పాదాలపై పడి పాడేపాట ఇది. ఈ ప్రపంచంలో ద్వేషంతో ఏమీ సాధించలేము. అలా ద్వేషంతో ఏదైనా సాధించినా అది హింసాత్మకమూ, దుష్ఫలితమే అవుతుంది.

విశ్వంలో ఏం సాధించాలన్న ప్రేమతోనే సాధ్యం. ప్రేమ అంటే భగవంతుడు. ఎందుకంటే, భగవంతుడు ప్రపంచంపై కరుణ వృష్టి కురిపిస్తాడు. ఏదీ ఆశించకుండా సర్వం ప్రపంచానికి అర్పిస్తాడు.

**ప్రభు క నిందా కర్నే వాలా ధర్తీ మే ధ్వాన్స్ జాయేగా**

**ఇస్ జగ్ మే ప్రబూ క ఝండా కభీన ఝుకనే పాయేగా.**

నాస్తికత్వం అంటే తమని తాము ఒక పీఠంపై ఊహించుకుని దైవాన్ని విశ్వసించే వారంతా మూర్ఖులు, అజ్ఞానులు, వారిని ఉద్ధరించి జ్ఞాన ప్రసాదం చేయటం కోసమే తాము జన్మించినట్టు ప్రవర్తించటం అలవాటయిపోయింది. ఎదుటివాడిని మూర్ఖుడు అనుకునేవాడే అసలైన మూర్ఖుడని, ఎదుటివాడిని అజ్ఞాని అనుకునేవాడిని మించిన అజ్ఞాని మరొకరు లేరని తెలియనంత విజ్ఞానవంతులు నాస్తికులు. ఎదుటి వారిని దూషించటం, భగవంతుడిని నిందించటమే వీరిపని. కానీ ఈ ప్రపంచంలో ద్వేషం ఎల్లకాలం చెల్లదు. అందుకే ప్రభువును నిందించేవారు ధ్వంసం అయిపోతారంటున్నాడు కవి ప్రదీప్.

'నాస్తిక్' సినిమాకు దర్శకత్వం వహించింది. తరువాత కాలంలో హాస్య వ్యంగ్య నటనకు పేరు పొందిన ఇ ఎస్ జోహర్. 'నాస్తిక్ ' సినిమా పాటలు, ముఖ్యంగా 'గగన్ ఝునా రహా' పాట ఎంతగా ప్రభావం చూపిందంటే, ఈ పాటను యోగాకూ, ధ్యానానికి ప్రతీకగా, ఒక సాధనంగా భావిస్తారు. శాంతంగా పాడే హేమంత్ కుమార్‌ను ధ్యానంలో ఒక స్థాయికి చేరిన గురువుగా, ఆందోళన చెందుతూ, కూడా తన అస్తిత్వాన్ని కోల్పోకూడదని తపిస్తున్న లత స్వరాన్ని ధ్యానంలో ఒక స్థాయికి చేరలని తపించే జీవికి ప్రతీకగా తీసుకుని పలు విశ్లేషణలు జరిగాయి. యోగాలో, ధ్యానంలో శిష్యుడి దృష్టి కేంద్రీకృతమయ్యేందుకు ఈ పాటను ఒక సాధనంగా వాడతారు.

ధ్యానం, భక్తి, కీర్తన, పూజ, ఆరాధన వంటివి వేర్వేరుగా కనిపించినా అన్నిటి పరమార్థం స్థూల, సూక్ష్మ శరీరాలను నియంత్రించటం మాత్రమే. ధ్యానం ఆరంభించిన కొత్తల్లో ప్రతి చిన్న విషయం ధ్యాన భంగం కలుగచేస్తుంది. మనసు ధ్యానంపై నిలవదు. చిన్న సమస్య కూడా తుఫానులా కనిపిస్తుంది. దానిలో చిక్కుకుని ఉక్కిరి బిక్కిరి అవుతాం. అది ఈ 'గగన్ ఝున్ ఝునా రహా' పాటలో నాయికలాంటి పరిస్థితి పాటలో, నాయిక నది ఒకవైపు నుంచి మరో వైపుకు వెళ్లాలని ప్రయత్నిస్తోంది. నది పొంగుతోందని గ్రహించింది. కానీ తన ప్రేమికుడిని కలవాలన్న కోరిక ఎంత తీవ్రంగా ఉందంటే, వరదలో నదిని దాటితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్న భయాన్ని అధిగమించేటంతగా. ఆమె నీటి మధ్యలోకి వెళ్లేసరికి తుఫాను తీవ్రం అయింది. ఆమె చుక్కాని పోయింది. నీరు ఎటు తీసుకు వెళ్తే అటు కొట్టుకు పోతుంది. పడవ దిశను నియంత్రించే శక్తి లేదామెకు. పాటలో 'గగన్' సూక్ష్మ ఆకాశం. గాలి, ఇతర శబ్దాలు మనిషిని ధ్యానం నుంచి తప్పించే విషయాలు. అయితే నాయికకు విశ్వాసం ఉంది. భగవంతుడికి తనను తాను సంపూర్ణంగా అర్పించుకుని, అన్నిటికీ అతడిపై భారం వేసి కర్తవ్యాన్ని నిర్వహించే ఆత్మ విశ్వాసం ఆమెది. దాంతో సూక్ష్మ అంశాలు అనేకం ఆమెకు సహాయపడతాయి. అందుకే చుట్టూ చెలరేగుతున్న తుఫానును పట్టించుకోకుండా ఆమె భగవంతుడిని ధ్యానిస్తూ తన గమ్యం చేరాలని ప్రయత్నిస్తూంటుంది. విశ్వాసం, ధ్యానం, మనిషికి ఈ గుండె నిబ్బరాన్నిస్తుంది. నాయిక తుపానుకు లొంగదు. దృష్టి గమ్యం వైపే పెడుతుంది. దాంతో తుపాను అదృశ్యం అవుతుంది. లక్ష్యాన్ని సాధించాలని అనుకున్నపుడు ప్రతిబంధకాలను పట్టించుకోకూడదు. ముందుకు సాగుతూంటే అవే అదృశ్యమైపోతాయి. నాయిక ఎట్టి పరిస్థితులలో తన ధైర్యాన్ని సడలనివ్వదు. విశ్వాసాన్ని వదలదు. భగవంతుడిపై నుంచి తన దృష్టి మరలకుండా కాపాడమని ప్రార్థిస్తోంది. ధ్యానం చేసేవారికి నాయికకు ఉన్నటువంటి దీక్ష, తపన, పట్టుదల, విశ్వాసాలుంటే ధ్యానం కుదురుతుంది.

సినిమా పాటలను కొందరు తేలికగా కొట్టేస్తారు. కానీ కళాకారులు ఎంతో శ్రమపడి, తపన పడి సమాజానికి మార్గ దర్శకత్వం చేసే కళను జనరంజకంగా సృజిస్తారు. ఎవ్వరికీ అర్థం కానటువంటి కళను సృజించి, 'మీకెవరికీ నాకున్నంత తెలివి లేదు' అనే నాస్తికులలా తనని తాను గొప్పగా భావించుకుంటే లాభంలేదు. 'కళ' అందరినీ చేరాలి. స్ఫూర్తినివ్వాలి. మార్గదర్శనం చేయాలి. ఆలోచనలు కల్పించాలి. అలాంటి కళను ఆనాటి కళాకారులు ఎంతో శ్రద్ధతో రూపొందించారు. భగవంతుడి భక్తిని బోధిస్తూనే మూఢ నమ్మకాలను, అంధ విశ్వాసాలను ఖండించారు. భగవంతుడి పేరు చెప్పి అమాయకులను దోచుకుని పబ్బం గడుపుకునే వారి అసలు రూపాన్ని ఎత్తి చూపించారు. వారి మాయలో పడవద్దని హెచ్చరించారు. 'దేఖ్ తెరే భగవాన్‌కి హాలత్' పాటలో సాహిర్ ఈ విషయాన్ని వ్యంగ్యంగా ప్రదర్శించాడు.

ధన్ వాలే హై బడే మచ్చన్ దాన్
సోనేకే బన్ వాయే మందర్
భగవాన్ రహతే ఇన్‌కే అందర్

**ఖరీ ఖరీ కహతాహై కలందర్**

**బన్ బైఠాహై ఇస్ దునియామే**

**ధరం సె ధన్ బల్వాన్**

**కిత్‌నా బదల్ గయా భగవాన్.**

'మచ్చన్ దాన్ ' అంటే మూర్ఖుడు, దుష్టుడు. ధనవంతులు పెద్ద దుష్టులు. బంగారు మందిరం తయారు చేస్తారు. భగవంతుడు ఆ మందిరంలో ఉంటాడు. 'కలందర్' అన్న పదాన్ని సాధారణంగా సూఫీ తత్వవేత్తలను సూచించేందుకు వాడతారు. 'షేక్ షరాఫుద్దీన్ బు ఆలీ కలందర్ పానిపటి' నుంచి ఈ కలందర్ అన్న పదం అమలులోకి వచ్చింది. మొఘల్‌ల కాలం నాటి వాడీయన. 'కలందర్' అంటే దివ్యదృష్టి కలవాడు భవిష్యత్ దర్శనం చేసేవాడు అన్న అర్థం వస్తుంది. ఇక్కడ మందిరంలో ఉండే పూజారిగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. వీరు గొప్పనీతి వాక్యాలు చెప్తారు. ధర్మపన్నాలు చెప్తారు. అటు మందిరంలోని  భగవంతుడు, ఇటు పూజారి కలసి ధనవంతుడికి డబ్బు సంపాదించి పెడతారు. అందుకే  పేద ప్రజలను వదిలి బంగారు మందిరంలో తిష్టవేసిన భగవంతుడు ఎంతగా మారిపోయాడో చూడమంటున్నాడు సాహిర్. గమనిస్తే, సాహిర్ భగవంతుడిని దూషించటంలేదు. భక్తిని విమర్శించటంలేదు. భగవంతుడిని బంగారు మందిరంలో బంధించి ప్రజలను మాయచేస్తూ ధనవంతులకు కొమ్ముకాస్తున్న పూజారులను, ధనవంతులను విమర్శిస్తున్నాడు. పేద ప్రజల ఇళ్లవైపు చూడడు.  ధనవంతుల అతిధి అయిపోయాడు, ఎంతగా మారిపోయాడు భగవంతుడు అంటున్నాడు సాహిర్.

ఇలా అన్ని రకాల దృక్కోణాలను సినిమాలో ప్రదర్శించారు మన కళాకారులు. ఆస్తికతను పొగిడారు. ఆస్తికతలోని మౌఢ్యాన్ని విమర్శించారు.

**రాం కె భక్త రహీం కె బందే**

**రచతే ఆజ్ ఫరేబ్ కె ధంధే.**

రాముడి భక్తుడు, రహీం అనుయాయి, కుట్రలు పన్నుతున్నారు అంటాడు కవి ప్రదీప్ 'దేఖ్ తెరే సన్సార్ కి హాలత్' పాటలో

**జోహం ఆపస్ మే న ఝగడ్ తే**

**బనే హువే క్యూన్ ఖేవ్ బిగడ్ తే**

మనలో మనం కొట్టుకోకపోయి ఉంటే, గెలిచే ఆట ఓడిపోయే వారం కాదు కదా!' అంటాడు. మనలో ఐకమత్యం లేకపోవటం వల్ల స్వాతంత్ర్యం వచ్చినా ఆరని రావణ కాష్టంలా దేశ విభజన సంభవమయింది. స్వాతంత్ర్యం వచ్చినా ఆనందం లేకుండా పోయింది అంటాడు.

**హం అప్ స్ మే లడ్ బైఠేతో దేశ్ కొ  కౌన్ సంభాలేగా**
**కోయీ బాహర్ వాలా అప్ నే ఘర్ సే హమే నికా లేగా**
**దీవానో హోష్ కరో.**

'దేశ్‌ప్రేమీ' సినిమాలో ఆనంద్‌బక్షీ రాసిన పాట ఇది. మనలో మనం కొట్టుకుంటూ ఉంటే దేశాన్ని ఎవరు రక్షిస్తారు? బయట వాడెవడో వచ్చి మన ఇంట్లోంచి మనల్ని బయటకు తరుముతాడు. పిచ్చివాళ్లలారా తెలివి తెచ్చుకోండి.

అయినా తెలివి రావటంలేదు. మతమౌఢ్యం ఎంత విచ్ఛిన్నకరమో, అహంకారం, నాస్తిక మౌఢ్యం కూడా మతంకన్నా విచ్ఛిన్నకరం. 'హే బ్రహ్మ, హే విష్ణూ,  హే శంకర,...రక్షకరో ...రక్షకరో' అని పాడుకోవటం తప్ప ఏమీ చేయలేము.

*(మరికొన్ని ఇలాంటి భక్తిగీతాలు వచ్చేనెల 'మ్యూజికల్ మ్యూజింగ్స్'లో)*

Post your comments